నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా అంకుషాపూర్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ బొక్కొనిగూడ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు ఘనాపూర్ గ్రామం, బొక్కొనిగూడ వ్యవసాయం లైన్, చందువట్ల గూడ వ్యవసాయం లైన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత కుమార్‌రెడ్డి తెలిపారు.

మేడ్చల్: మరమ్మతుల కారణంగా నేడు పూడూర్ సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. పూడూర్ పరిధిలో ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

గుండ్లపోచంపల్లిలో..

గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మైసమ్మగూడ, బీరప్పగడ్డ, దూలపల్లి, అయోధ్య క్రాస్ రోడ్, అపరెల్ పార్క్, నైబర్‌హుడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ చెప్పారు.

పార్కు అభివృద్ధికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న జూపల్లి సురేష్ తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో పార్కు అభివృద్ధికి బీజేపీ సీనియర్ నేత జూపల్లి నరేష్ గురువారం తనవంతుగా రూ. 10 వేల రూపాయల నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సూర్యశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జూపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం న్యూ ఇయర్ కేలండర్ ఆవిష్కరణ



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రపాల్ కుమ్మరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను సంఘం పెద్దలు వీరేశం, చంద్రయ్యల ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీహరిగౌడ్, రమేష్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఉపాధ్యక్షులు వీరేశం, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి అశోక్, రుద్రపాల్ కుమ్మరి సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్, లింగం, రమేష్, కృష్ణమూర్తి, నర్సింగ్, సాయిబాబా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో సంఘం భవన నిర్మాణం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు.

ఆర్ఐఎంసీలో సీటు సాధించిన విద్యార్థి



విద్యార్థి ఫణిందర్‌రెడ్డిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం తదితరులు

కీసర: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ) డెహ్రాడూన్‌లో వున్న స్కూల్ 8వ తరగతి అడ్మిషన్‌కి జూన్ 2024లో జరిగిన పరీక్షా ఫలితాల్లో మన తెలంగాణకి వున్న ఏకైక సీటును దమ్మాయిగూడలో గల క్రాంతికీస్ ఫర్ సైనిక్, (నవోదయ, ఆర్ఎంఎస్‌లో చదివిన విద్యార్థి ఫణింద్‌రెడ్డికి సీటు వచ్చింది. ఈ నేపథ్యంలో విద్యార్థి ఫణిందర్‌రెడ్డిని గురువారం స్కూల్ యామమాన్యం అభినందించారు. క్రాంతి కీస్‌స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కళ్యాణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతికి డాక్టరేట్ ప్రదానం



పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అధ్యాపకురాలిగా పని చేస్తున్న ప్రశాంతికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఎ మెషిన్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ అండ్ అల్గారిథమ్స్ ఫర్ అనామలీ డిటెక్షన్ టువర్డ్స్ నెట్‌వర్క్ సెక్యూరిటీ' అనే అంశంపై ప్రశాంతి చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ప్రశాంతిని ఎన్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి, సీఎస్ఈ హెచ్ఓడీ డా. రామేశ్వరయ్య, అధ్యాపక బృందం గురువారం అభినందించారు.



రాంపల్లి-చర్లపల్లి రహదారిలో శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి



రాంపల్లి-కరీంగూడ రహదారిలో ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి

బ్రిడ్జి నిర్మాణాలకు మోక్షమెప్పుడో..?

- శిథిలావస్థకు చేరుకున్న పలు బ్రిడ్జిలు
- ప్రారంభించని కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు
- రహదారిపై నుంచి వరదనీటి ప్రవాహం
- నానా అగచాట్లు పడుతున్న స్థానికప్రజలు
- బ్రిడ్జి నిర్మాణాలపై దృష్టిపెట్టని అధికార యంత్రాంగం





రాంపల్లి చౌరస్తాలో.. వరదనీటిలోనే వాహనాల రాకపోకలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి-చర్లపల్లి, రాంపల్లి-కరీంగూడ రహదారుల్లో కొన్ని ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాంపల్లి నుంచి చర్లపల్లి వెళ్లే రహదారిలో నాగారం, చర్లపల్లి చెరువుల నుంచి వరద నీరు వెళ్లే కాలువ వద్ద ఏళ్ల క్రితం బ్రిడ్జినిర్మాణం చేపట్టారు. ఏడాది పొడవునా ఈ బ్రిడ్జి కింది నుంచి నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ రహదారి గుండా ప్రతి నిత్యం రాంపల్లితో పాటు పరిసరాల ప్రజలు మల్లాపూర్, నాచారం, ఇండస్ట్రీస్‌కు ప్రతి నిత్యం వేలాది మంది ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కొత్తగా చర్లపల్లి రైల్వేస్టేషన్ కూడా ప్రారంభించారు. ఈ రహదారిలో వర్షకాలం వచ్చిందంటే వరదనీరు బ్రిడ్జిపై నుంచి రోజుల తరబడి ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రాంపల్లి-చర్లపల్లి రహదారి విస్తరణ పనులు చేపడుతోంది. కానీ ఈ రహదారిలో వరద నీరు ప్రవహించే చోట ఏండ్ల క్రితం నిర్మించిన శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను మాత్రం ఇప్పటివరకు ప్రారంభించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా పనులు ప్రారంభించండి

బ్రిడ్జి నిర్మాణ పనులకు అనువైన సమయం ఇదేనని, వర్షకాలం వచ్చిదంటే పనులు చేపట్టడం కష్టమని అక్కడి ప్రజలు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులతోపాటు, ముందుగా బ్రిడ్జినిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా రాంపల్లి-కరీంగూడ రహదారిలో కూడా రాంపల్లి ఎర్రమల్లేవాగు పై గతంలో అప్పటి అవసరాల తగ్గట్టు నిర్మించిన బ్రిడ్జి కూడా నేడు శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో రాంపల్లి, గోధుమకుంట చెరువుల పై భాగం నుంచి పెద్ద ఎత్తున వరదనీరు రావడంతో బ్రిడ్జి పై నుంచి వరదనీరు ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో రాంపల్లి-కరీంగూడకు రాకపోకలు బంద్‌కావాల్సి వస్తుందని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ కూడా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారని, కానీ మొదట ఈ రహదారిలో శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి స్థానంలో వర్షకాలం ప్రారంభమయ్యేలోపు కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించాలని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇదిలా వుంటే ఇక నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా వద్ద నాగారం-కుషాయిగూడ రహదారిలో కూడా వర్షకాలం ప్రారంభమైతే రహదారి గుండా రాకపోకలు సాగించే వాహనదారులందరూ వరదనీటిలోనే తమ ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. ఏండ్ల తరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బి అధికారులు మాత్రం అక్కడ బ్రిడ్జి నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని దమ్మాయిచెరువు, నర్సింహా చెరువు, కోపుల కుంట, భవానీనగర్ కుంటలు నిండి పెద్ద ఎత్తున వరదనీరు రావడం జరుగుతోంది. ఈ వరద నీరంతా రాంపల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారి పై నుంచే వెళ్తోందని, ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపడితే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు వేడుకుంటున్నారు.

బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు



నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిచౌరస్తా వద్ద, రాంపల్లి-చర్లపల్లి రహదారిలో, రాంపల్లి-కరీంగూడ రహదారిలో శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జిల స్థానంలో కొత్త బ్రిడ్జిలు నిర్మించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపడుతాము.

- నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి

అన్ని వృత్తుల వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

కీసర: ప్రపంచంలో ఎన్ని వందల వృత్తులు ఉన్నా వారందరినీ తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తికే ఉందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. నాగారంలో గురువారం జరిగిన సెయింట్ మేరీస్ బేతనీ కాన్వెంట్ విద్యాలయ రజితోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, అందుకే ఉపాధ్యాయులకు సమాజంలో సముచిత స్థానం ఉందన్నారు. అబ్దుల్ కలాం, నెల్సన్ మండేలా వంటి మహాత్ములు విద్యకు ఇచ్చిన ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, హరిబాబు, కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బ్రిగిట్ట తదితరులు పాల్గొన్నారు.



సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్

ఇంజనీరింగ్ కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు





మేడ్చల్: మైసమ్మగూడలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో సంక్రాంతి పండగ సందర్భంగా విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. సెయింట్ పీటర్స్ కళాశాల, నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల్లో ఎంతో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. భోగి మంటలు వేసి రకరకాల రంగవల్లులు దిద్ది, పతంగులు ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. పల్లె వాతావరణం ఏర్పాటు చేసి గోపూజలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఆయా కళాశాలల యాజమాన్య సభ్యులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురి మృతికి కారణమైన లారీ డ్రైవర్ అరెస్ట్



మేడ్చల్: నిర్లక్ష్యంగా, అతివేగంగా లారీ నడిపి ద్విచక్రవాహనంను ఢీకొట్టి ముగ్గురి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హర్యానా రాష్ట్రం మెవాత్‌కు చెందిన షబు(32) 44వ జాతీయ రహదారిపై ఆదివారం లారీని నడుపుతూ చెక్‌పోస్ట్ వద్ద ముందుగా వెళ్తున్న ద్విచక్రవాహనంను ఢీ కొట్టడంతో భార్య, భర్తలు, వారి కూతురు అక్కడిక్కడే మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన డ్రైవర్ షబు పరారీలో ఉండగా పోలీసులు గుర్తించి గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బీజేపీ అధ్యక్షుల నియామకం

మేడ్చల్: మేడ్చల్ రూరల్ జిల్లాలోని మున్సిపాలిటీల, మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ జిల్లా రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన నాయకుడు డాక్టర్ మురళీధర్ గౌడ్ నూతన అధ్యక్షులను ప్రకటించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా కావేరి శ్రీధర్‌ముదిరాజ్, మేడ్చల్ రూరల్ మండల అధ్యక్షుడిగా అక్కలదేవి శ్రీశైలం యాదవ్, తూంకుంట అధ్యక్షుడిగా పట్నం నర్సింహారెడ్డి, శామీర్‌పేట్ మండల అధ్యక్షుడిగా కోరివి కృష్ణ, జవహర్‌నగర్ (వెస్ట్) అధ్యక్షుడిగా కమలాకర్, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా కొండబోయిన నాగరాజుయాదవ్, ఘట్‌కేసర్ రూరల్ మండల అధ్యక్షుడిగా బస్వరాజుగౌడ్, పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నానావత్ సురేష్‌నాయక్, బోడుప్పల్ కార్పొరేషన్ వెస్ట్ అధ్యక్షుడిగా తలారి రవి యాదవ్‌లను నియమించినట్లు తెలిపారు.

ముగ్గుల పోటీలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో 17 వార్డులో కాలనీ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలను మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌లు ప్రారంభించారు. ముగ్గుల పోటీలో గెలిచిన విజేతలకు మొదటి బహుమతి క్రింద రూ. 2500, రెండవ బహుమతి క్రింద రూ. 1500 మూడవ బహుమతి క్రింద రూ. 1000 చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, సెరినిటీ స్కూల్ కరస్పాడెంట్ సోముల వసంత, కాలనీ అధ్యక్షులు మధుసుధన్‌రెడ్డి, పుండరీకం, గౌస్, రంగారెడ్డి, అసోషియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవు

మేడ్చల్: వాహనాలను నడిపే డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలను నడిపితే ప్రమాదాలు సంభవించవని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా మేడ్చల్ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రమాదాలు చేయని డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రమాదాలు చేయని డ్రైవర్లు వెంకటేశ్వర్లు, కృష్ణ, మహేందర్‌లను ఆయన ప్రశంసించారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, డీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి



కండ్లకోయలో లారీకి రిఫ్‌లెక్ట్ టేపు అతికిస్తున్న రవాణా అధికారులు

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కీసర: జనాభా ప్రాతిపదికంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పిడమర్తి రవి అన్నారు. గురువారం కీసర మండలం అహ్మద్‌గూడలో ఉమ్మడి మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి యువ గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మాదిగలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు మీసాల మల్లేష్, నర్సింగ్‌రావు, కీసర అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లేష్, బాలయ్య, లింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఎన్‌సీఎల్ వద్ద యూటర్న్‌కు బారికేడ్ల ఏర్పాటు

కుత్బుల్లాపూర్: జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతుండడంతో జీడిమెట్ల ఎన్‌సీఎల్ వద్ద వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మధ్యలో యూటర్న్ తీసుకునేందుకు వీలుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అంగడిపేట్, ఎన్సీఎల్, గంగా ఎంక్లేవ్, వైష్ణవి కాలనీ, అపర్ణ షెరినిటీకి వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా చేశారు. సుచిత్ర నుంచి కొంపల్లికి వెళ్లే వాహనాలు సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి తెలిపారు.



ఎన్‌సీఎల్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

తుది దశకు ఏసీపీ కార్యాలయ భవనం పనులు

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఏసీపీ నూతన కార్యాలయ భవనం పనులు తుది దశకు చేరుకున్నాయి. సంక్రాంతి తర్వాత ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లోనే ఏసీపీ కార్యాలయం కొనసాగుతున్నది. అయితే సిబ్బందికి సరిపడా స్థలం లేకపోవడంతో నూతన కార్యాలయం నిర్మిస్తున్నారు. అదేవిధంగా మేడ్చల్ డీసీపీ కార్యాలయం పనులు కూడా ప్రారంభం అయ్యాయి. సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌తో పాటు అల్వాల్ ట్రాఫిక్, మేడ్చల్ అదనపు డీసీపీ, ఎస్ఓటీ, క్రైమ్‌కు సంబంధించిన స్టేషన్లు ఉన్నాయి.



పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నిజాంపేట్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. దేశంలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల నిర్వహణలో గవర్నర్ల జోక్యంతో ఇబ్బందికరంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ఏకధాటిగా అధికారాల కేంద్రీకరణకు తీసుకువచ్చిన ఈ ముసాయిదా ఫెడరలిజాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఈ యూజీసీ నిబంధనల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే జిల్లావ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యురాలు, తెలుగు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'సమన్వయ్'

కుత్బుల్లాపూర్: శివ శివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండురోజులుగా జరిగిన సమన్వయ్ కార్యక్రమం గురువారం ముగిసింది. పలు ప్రాంతాల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు శ్రేష్ఠ ది యంగ్ మేనేజర్ ఈవెంట్ విజేతకు రూ. 50 వేల నగదు బహుమతి ప్రదానం చేశామని విద్యా సంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి తెలిపారు.

వివాహిత అదృశ్యం

సుభాష్‌నగర్: వివాహిత అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన రెడ్డిబాబు, చిత్రశ్రీ (20) భార్యాభర్తలు. గత నెల 20న చిత్రశ్రీ ఇంట్లోవారికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో భర్త చుట్టుపక్కల, స్నేహితులు, బంధువులు ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

మూసాపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కవిత అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుమారు 80 ప్ర త్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 10 ఈ బస్సులకు రిజర్వేషన్లు అయ్యా యని తెలిపారు. బీహెచ్ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్‌లో పా యింట్లు ఉంటాయని, ఖమ్మం, విజయవాడ, సత్తుపల్లి, వరంగల్, రాజమండ్రి వంటి ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని చెప్పారు. బుకింగ్ లేని బస్సుల్లో మహాలక్ష్మి టిక్కెట్లు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకే వర్తిస్తాయని పేర్కొన్నారు.


వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

కుత్బుల్లాపూర్: వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ ఆర్‌టీఓ సిబ్బంది జాతీయ రహదారి 44, ఓఆర్‌ఆర్‌పై గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. భారీ, చిన్నతరహా ట్రాన్స్‌పోర్టు వాహనాలను ఆపి రిఫ్‌లెక్ట్ టేపు ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు సాదుల శ్రీనివాస్, శిల్ప, సహాయ వాహన తనిఖీ అధికారి త్రివేణిబాయి, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీటీఓ రఘునందన్‌గౌడ్

ఇంజనీరింగ్ విద్యపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



నిజాంపేట్: ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంజనీరింగ్ విద్యలో అవసరమైన సమూలమైన మార్పులు కేంద్రంగా 3 రోజుల పాటు జరగనున్న అంతర్జాయ సదస్సు ఐసీటీఐఈఈ 2025 గురువారం ప్రారంభమైంది. వీఎన్ఆర్ వీజేఐఈటీతో సహా విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆతిథ్య సంస్థలుగా ఇండో యూనివర్సల్ కొలాబోరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ (ఐయూసీఈఈ) సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సు 12వ సంపుటిలో గౌరవ అతిథి, ఏబీఈటీ (యూఎస్ఏ) సీఈఓ డా.మైఖేల్ మిలిగన్, ఐయూసీఈఈ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహక సంచాలకులు ఆచార్య డా.కృష్ణ వేదులతో సహా యూఎస్ఏ, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, పోర్చుగల్ తదితర దేశాలతో పాటు మనదేశంలోని పలు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, పరిశ్రామిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కృత్రిమ మేథ వల్ల కలిగే ప్రయోజనాలు, అనుకూల ప్రతికూల ప్రభావాలు, నేటి తరం విద్యార్థులకు అనుగుణమైన విద్యాబోధనాసరళి, సమస్య పరిష్కర్తలుగా బాధ్యతాయుతంగా ఎదగటానికి తగిన స్థైర్యంతో యువ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. సదస్సులో భాగంగా ఐయూసీఈఈ వార్షిక విద్యార్థి సమితి ఐఏఎస్ఎఫ్ 2025 పేరిట పలు రాష్ట్రాల విద్యార్థుల డిజైన్ థింకింగ్, ఇంజనీరింగ్ ప్రాజెక్టుల ప్రదర్శనతో సహా విద్యార్థులు, అధ్యాపకులకు ప్రత్యేక కార్యశాలలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఎన్ఆర్ విజేఐఈటీకి చెందిన విద్యార్థి ప్రగతి డీన్ ఆచార్య డా.వై. పద్మశాయి, సంచాలకులు ఆచార్య డా.బి.చెన్నకేశవరావు, ప్రధానాధ్యాపకులు ఆచార్య డా.సి.డి. నాయుడు, వీజేఐఎం సంచాలకులు ఆచార్య డా.భరత్‌భూషణ్‌సింగ్, విజ్ఞానజ్యోతి సంస్థల పురోగమన సంచాలకులు ఆచార్య డా.కోడె సంధ్య, పూర్వ అధ్యక్షుడు డా.డి.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.